కుదిరిన పొత్తు

ఒకే గూటికి కమలం, రెండాకుల పార్టీలు

అన్నాడీఎంకే నేతృత్వంలో కూటమి

ఆ పార్టీ అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోబోం

బీజేపీ అగ్రనేత అమిత్‌షా స్పష్టీకరణ



మీడియా సమావేశంలో బీజేపీ, అన్నాడీఎంకే నేతలు

చెన్నై, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే - బీజేపీల మధ్య మళ్లీ పొత్తు కుదిరింది. ఈ రెండు పార్టీలు మళ్లీ కూటమి కట్టాయి. సాక్షాత్తూ బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చెన్నై వచ్చి మరీ ఈ పొత్తును ఖరారు చేయడంతో పాటు స్వయంగా మీడియా ముందు ప్రకటించడం విశేషం. దీంతో వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమిని ఢీకొట్టే బలమైన కూటమికి బాటలు పడినట్లయింది.

అమిత్‌షా పర్యటనలో ఎన్నో విశేషాలు...

రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం రాత్రి 11.20 గంటలకు విమానంలో నగరానికి చేరుకున్న అమిత్‌షాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్, బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీ మంత్రి పొన్‌రాధాకృష్ణన్, శాసనసభ్యుడు నయినార్ నాగేంద్రన్, పార్టీ సమన్వయకర్త కేశ వినాయగం, సీనియర్ నేత ఎం.చక్రవర్తి తదితరులు ఘనస్వాగతం పలికారు. ఆ తర్వాత ఆయన స్థానిక గిండిలోని స్టార్‌హోటల్‌లో బస చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పార్టీ ప్రముఖులు, నాయకులతో అమిత్‌షా వరుసగా భేటీ అయ్యారు. వచ్చే ఏడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఆ తర్వాత అమిత్‌షా అక్కడి నుంచి కారులో బయలుదేరి సాలిగ్రామంలో ఉన్న తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఇంటికి చేరుకున్నారు. ఇటీవల మృతి చెందిన తమిళిసై తండ్రి కుమరిఅనంతన్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి ఆమెను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అమిత్‌షాతోపాటు, అన్నామలై, కరాటే త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

ఆడిటర్ గురుమూర్తితో ముందే భేటీ...

తమిళ పత్రిక తుగ్లక్ సంపాదకుడు, ప్రముఖ ఆడిటర్ గురుమూర్తితో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు అమిత్‌షా భేటీ కావాల్సి ఉండగా ఉదయం 10 గంటలకే ఆయనతో సమావేశమవడం విశేషం. తమిళిసై నివాసం నుంచి కారులో మైలాపూరులో ఉన్న గురుమూర్తి ఇంటికి ఆయన చేరుకున్నారు. ఇరువురూ రాష్ట్ర శాసనసభ ఎన్నికల సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ భేటీలో కేంద్రమంత్రి ఎల్.మురుగన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పాల్గొన్నారు. మధ్యాహ్నం 1గంట ప్రాంతంలో అమిత్‌షా అక్కడి నుంచి బయలుదేరి గిండి స్టార్‌హోటల్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం అక్కడే పార్టీ నాయకులతో కలిసి భోజనం చేసిన తర్వాత గంటసేపు విశ్రాంతి తీసుకున్నారు.

అన్నాడీఎంకే నేతృత్వంలో పోటీ: అమిత్‌షా

రాష్ట్రంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో కూటమి పని చేస్తుందని, ఆ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోబోమని అమిత్‌షా ప్రకటించారు. కమలాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అన్నాడీఎంకే-బీజేపీ కూటమి ఏర్పాటైందని, రాష్ట్రంలో పళనిస్వామి నేతృత్వంలో పనిచేస్తుందన్నారు. ఎన్నికలపై పళనిస్వామి నేతృత్వంలో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కూటమి ఏర్పాటు ఇరుపార్టీలకు బలం చేకూరుస్తుందని, ఎవరు ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలి, అధికారంలో ఎవరెవరికి భాగస్వామ్యం కల్పించాలన్న దానిపై మున్ముందు నిర్ణయిస్తామన్నారు. అవినీతి, మోసాలు సహా పలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు త్రిభాషా విధానం, నియోజకవర్గాల పునర్విభజన, సనాతన తదితర అంశాలను డీఎంకే ప్రభుత్వం లేవనెత్తుతోందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో, డీఎంకే పాలనలో అవినీతి, మోసం, శాంతిభద్రతలు, దళితులపై దాడులు, మహిళా భద్రత చర్చనీయాంశాలుగా ఉంటాయన్నారు. టాస్మాక్‌లో రూ.39,775 కోట్లు, ఇసుక దోపిడీ ద్వారా రూ.5 వేల కోట్ల మేర అవినీతి జరిగిందన్నారు. విద్యుత్, నేలబొగ్గు తదితరాల్లో రూ.4 వేల కోట్లు, ఎల్కాట్ సంస్థలో ప్రభుత్వ వాటా విక్రయాల ద్వారా రూ.3 వేల కోట్లు, రవాణా శాఖలో రూ.2 వేల కోట్లు, మనీ ల్యాండరింగ్ ద్వారా సుమారు రూ.1,000 కోట్లు అవినీతి జరిగిందన్నారు. పౌష్టికాహార పరికరాల కొనుగోలులో రూ.450 కోట్లు, ఎర్రమట్టి అక్రమ రవాణా, ప్రభుత్వ ఉద్యోగాలకు లంచం, ఉపాధి హామీ పథకంలో అవినీతి సహా పలు కోట్ల మేర అవినీతి జరిగిందన్నారు. ఈ అవినీతిపై ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అవినీతి నుంచి ప్రజల దృష్టి మరల్చేలా నీట్, నియోజకవర్గాల పునర్విభజన తదితరాల అంశాలను డీఎంకే ముందుకు తెస్తోందన్నారు. నీట్ సహా అన్ని అంశాలపై అన్నాడీఎంకే చర్చలు జరిపి తర్వాత ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రజలను కలుసుకొనే సమయంలో, వారు నిజంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించనున్నామన్నారు. డీఎంకేలా ఇచ్చిన హామీల నుంచి వెనుదిరిగేది లేదన్నారు.

7లో

అమిత్‌షా చెంతకు ఈపీఎస్

హోటల్లో బస చేసిన అమిత్‌షా వద్దకు అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) వెళ్లారు. తన సహచరులైన కేపీ మునుస్వామి తదితరులతో హోటల్‌కు వెళ్లిన ఈపీఎస్.. కొద్దిసేపు షాతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఆ తరువాత తన సహచరులతో కలిసి అమిత్‌షాతో చర్చించారు. అప్పుడే ఇరువురు నేతలు పొత్తుపై ఒక నిర్ణయానికి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ తరువాత అక్కడి నుంచి నేరుగా టినగర్‌లోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయమైన కమలాలయానికి చేరుకున్న అమిత్‌షా, ఈపీఎస్ బృందాలు మీడియాతో మాట్లాడాయి. అయితే ఈ సమావేశం మొత్తం అమిత్‌షా మాత్రమే మాట్లాడగా, పక్కనే వున్న ఈపీఎస్, అన్నామలై ప్రేక్షకపాత్ర వహించారు.

తమిళం... గౌరవం

తమిళ భాష, సంస్కృతి, సంప్రదాయాలు గౌరవించేలా ప్రధాని మోదీ, పార్లమెంటులో సెంగోల్ ప్రతిష్ఠించారని, ఆ సమయంలో దానికి కూడా డీఎంకే వ్యతిరేకించిందన్నారు. తమిళ గౌరవాన్ని చాటేలా కాశి తమిళ సంగమం, సౌరాష్ట్ర తమిళ సంగమం తదితరాలకు మోదీ స్వయంగా ఆతిథ్యం ఇచ్చారని తెలిపారు. రాష్ట్రంలో ప్రాచీన సంప్రదాయ క్రీడ 'సిలంబం'ను ఖేలో ఇండియా పోటీల్లో చేర్చామన్నారు. రాష్ట్రంలో తమిళ భాషను ప్రోత్సహించే సంస్థ సెమ్మొళి తమిళ పరిశోధన సంస్థ స్థాపకుడు ప్రధానమంత్రి మోదీ అన్నారు. హర్వార్డ్ విశ్వవిద్యాలయంలో తమిళ పరిశోధన పీఠం ఏర్పాటు చేశామని, తిరుక్కురల్‌ను ప్రపంచంలోని వివిధ భాషల్లో అనువదిస్తున్నామని, ఇప్పటివరకు 63 భాషల్లో తిరుక్కురల్ అనువదించామని తెలిపారు. భారతీయార్ రచనలు పుస్తకంగా ఆవిష్కరించింది ప్రధాని మోదీ అన్నారు. సివిల్ సర్వీస్ పరీక్షలు తమిళంలో రాస్తున్నారని, గతంలో డీఎంకే భాగస్వామిగా ఉన్న కేంద్రప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కేంద్ర సాయుధ పోలీసుల పరీక్షలు తమిళం సహా పలు ప్రాంతీయ భాషల్లో రాసే అవకాశం కల్పించామన్నారు. డీఎంకే భాగస్వామ్య సంకీర్ణ ప్రభుత్వం హిందీ, ఆంగ్లంలో మాత్రమే పరీక్షలు రాసే విధానం ఉండేదని గుర్తుచేశారు. ఎక్కడ ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు ఉన్నాయో, ఆయా రాష్ట్రాల్లో ఇంజనీరింగ్, వైద్య కోర్సులు వారి మాతృభాషల్లోనే విద్యార్థులు చదువుకుంటున్నారని, ఈ కోర్సులను తమిళ పాఠ్యాశాలుగా రూపొందించాలని ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కోరినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవని అన్నారు. డీఎంకే ఇప్పటివరకు తమిళం, తమిళం అంటూ మాట్లాడుతోందని, అసలు తమిళ భాష అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టారో ప్రజలకు వివరించేందుకు సిద్ధమా? అని అమిత్‌షా ప్రశ్నించారు.

మనసుంటే మార్గాలెన్నో...

- ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా రాణిస్తున్న రాజేశ్వరి

స్టేట్‌బ్యాంక్‌లో 1074 కిలోల ఆలయాల బంగారం



మాజీ న్యాయమూర్తుల సమక్షంలో ఓ ఆలయ ట్రస్టుబోర్డు అధ్యక్షుడికి గోల్డెన్ బాండ్‌ను అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్


చెన్నై, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రంలో 21 సుప్రసిద్ధ ఆలయాల్లో భక్తులు కానుకలుగా సమర్పించిన 1074 కిలోల బంగారాన్ని ముంబాయిలో కరిగించి మేలిమి బంగారు కడ్డీలుగా మార్చి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పొదుపు చేసి ప్రభుత్వం పొందిన గోల్డ్ బాండ్లను ఆయా ఆలయాల నిర్వాహకులకు ముఖ్యమంత్రి స్టాలిన్ అందజేశారు. తిరుచ్చి సమయపురం మారియమ్మన్ ఆలయం, దిండుగల్ జిల్లా పళని అరుళ్మిగు దండాయుధపాణి స్వామి ఆలయం, కోయంబత్తూరు జిల్లా అనైమలై అరుళ్మిగు మాసానియమ్మన్ ఆలయం ట్రస్టుబోర్డు అధ్యక్షులు వీఎస్‌టీ ఇలంగోవన్, కేఎం సుబ్రమణియన్, డిప్యూటీ కమిషనర్లు ఏఆర్ ప్రకాష్, ఎస్. మారిముత్తు, పి. రమేష్ తదితరులు స్టాలిన్ నుంచి ఈ గోల్డెన్ సేవింగ్ బాండ్లను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పీకే శేఖర్‌బాబు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దురైసామి రాజు, హైకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ కె.రవిచంద్రబాబు, జస్టిస్ ఆర్ మాలా, పర్యాటక, దేవాదాయ శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.మణివాసన్, దేవాదాయశాఖ కమిషనర్ పీఎన్ శ్రీధర్, అదనపు కమిషనర్ డాక్టర్ సి. పళని, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ జోబీ జోస్ తదితరులు పాల్గొన్నారు.

రూ.84.76 కోట్లతో 326 గ్రంథాలయ భవనాలు...

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో రూ.84.76 కోట్లతో నిర్మించిన 326 గ్రంథాలయ భవనాలను, పాఠశాలల విద్యాశాఖ ఆధ్వర్యంలో చిన్నారుల కోసం రూ.32.64 కోట్లతో నిర్మించిన తరగతి గది భవనాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. సచివాలయంలో శుక్రవారం ఉదయం ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ భవనాలకు ఆయన ప్రారంభోత్సవం జరిపారు. కళ్ళకురిచ్చి, కాంచీపురం, కృష్ణగిరి, మదురై, నాగపట్టినం, పుదుకోట, రామనాథపురం, రాణిపేట, సేలం, తంజావూరు, తిరుచ్చి, తిరుపత్తూరు, తిరువారూరు జిల్లాల్లో చిన్నారుల కోసం ఏర్పాటు చేసే తరగతి గదులు వారిలో చదవాలనే ఆసక్తిని అధికం చేసేలా నిర్మించినట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అన్బిల్ మహేష్ పొయ్యామొళి, సీవీ గణేశన్, టీఆర్బీ రాజా, గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ బేదీ, పాఠశాలల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేనే శాశ్వత అధ్యక్షుడిని

- పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్



ప్యారీస్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే)కి తానే శాశ్వత అధ్యక్షుడినని, ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ తేల్చి చెప్పారు. విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలోని తైలావనం గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాందాస్ ఈ మేరకు పునరుద్ఘాటించారు. పీఎంకే అధ్యక్షుడిగా ఉన్న తన కుమారుడు డాక్టర్ అన్బుమణిని తొలగిస్తున్నట్లు రాందాస్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాను స్థాపించిన పార్టీకి ఇక తానే శాశ్వత అధ్యక్షుడినని ప్రకటించుకున్నారు. ఇదిలా ఉండగా తండ్రీకొడుకులకు నచ్చచెప్పి, ఇద్దరినీ కలపాలని పలువురు సీనియర్ రాజకీయ నేతలు ప్రయత్నించినట్లు తెలిసింది. అయితే అందుకే రాందాస్ విముఖత చూపినట్లు సమాచారం.

రాష్ట్ర కమల దళాధిపతిగా నయినార్ నాగేంద్రన్

- ఏకైక నామినేషన్ దాఖలు
- అధ్యక్ష పదవి లాంఛనమే
- నేడు ప్రకటించే అవకాశం



నామినేషన్ దాఖలు చేస్తున్న నయినార్ నాగేంద్రన్, ఆ పార్టీ సీనియర్లు

చెన్నై, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కమల దళాధిపతిగా తిరునల్వేలి ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్ పదవిని అధిరోహించడం ఖాయమైపోయింది. రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో నయినార్ నాగేంద్రన్ మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో అధికారిక ప్రకటన లాంఛనమే అయింది. ఈ మేరకు బీజేపీ అధిష్ఠానం శనివారం ప్రకటించనుంది. పార్టీ నిర్వహణ రీత్యా రాష్ట్ర బీజేపీలో 67 జిల్లాలున్నాయి. పార్టీలో కొత్త సభ్యుల చేరిక గత ఏడాది సెప్టెంబరులో ప్రారంభించారు. అనంతరం నవంబరులో శాఖల స్థాయిలో ఎన్నికలు చేపట్టి నిర్వాహకులను ఎంపిక చేశారు. తదుపరి మండల అధ్యక్షులు, జిల్లా అధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహించారు. ఈ ఏడాది జనవరిలో కొత్త జిల్లా అధ్యక్షులు నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు పదవికి జనవరిలో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఢిల్లీ శాసనసభ ఎన్నికలు సహా వివిధ కారణాలతో అధ్యక్ష పదవి ఎన్నికలో జాప్యం నెలకొంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర అధ్యక్ష పదవికి శనివారం ఎన్నిక జరగనుందని ప్రకటించారు. ఈ పదవికి పోటీచేసే అభ్యర్థులు, శుక్రవారం రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో నామినేషన్లు సమర్పించాలని ఎన్నికల నిర్వాహకులు ప్రకటించారు. అయితే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి నయినార్ నాగేంద్రన్ మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. నాగేంద్రన్ నామినేషన్‌ను ప్రస్తుత అధ్యక్షుడు అన్నామలై, మాజీ అధ్యక్షుడు పొన్. రాధాకృష్ణన్, హెచ్.రాజా, ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్, కనక సభాపతి, వీపీ దురైస్వామి, పొన్ బాలగణపతి తదితరులు బలపరిచారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం నాగేంద్రన్‌కు పార్టీ సీనియర్ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. నామినేషన్ల స్వీకరణ సాయంత్రం 4 గంటలకు ముగియగా, ఇతరులెవ్వరూ దాఖలు చేయకపోవడంతో, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా నయినార్ నాగేంద్రన్ ఎన్నిక ఖరారైపోయింది.



నాగేంద్రన్‌తో అన్నామలై ముచ్చట్లు

చివరి నిమిషంలో మారిన నిబంధన...

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ సర్వసభ్య మండలి సభ్యులు తదితర పదవుల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపే నేతలకు పదేళ్ల పాటు ప్రాథమిక సభ్యత్వం ఉండాలంటూ గురువారం ప్రకటించారు. కానీ, ఈ పదవికి పోటీ చేస్తారని భావించిన అన్నామలై, నయినార్ నాగేంద్రన్‌కు పదేళ్ల పార్టీ సభ్యత్వం లేకపోయింది. దీంతో, శుక్రవారం నామినేషన్ల సమయంలో కొంత గందరగోళం నెలకొంది. అంతలోనే పోటీ చేసే అభ్యర్థులకు విధించిన నిబంధనలను సడలించారు. ఆంధ్ర, సిక్కిం రాష్ట్రాల అధ్యక్ష పదవుల ఎన్నిక సందర్భంగా, 10 ఏళ్ల ప్రాథమిక సభ్యత్వం నుంచి మినహాయింపు కల్పించినట్లు పార్టీ చివరి నిమిషంలో ప్రకటించడంతో, నయినార్ నాగేంద్రన్ నామినేషన్ దాఖలుచేశారు.

అన్నాడీఎంకేతో రాజకీయ ప్రస్థానం...

రాష్ట్ర కమల దళాధిపతిగా పదవీ బాధ్యతలు చేపట్టనున్న దేవర్ సామాజిక వర్గానికి చెందిన 64 ఏళ్ల నయినార్ నాగేంద్రన్ రాజకీయ జీవితం అన్నాడీఎంకేతో మొదలైంది. తిరునల్వేలి జిల్లా పనకుడి సమీపం తండయార్‌కుళానికి చెందిన నాగేంద్రన్ పీజీ డిగ్రీ చేశారు. ఆయనకు భార్య చంద్ర, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. 1989లో అన్నాడీఎంకేలో చేరిన నాగేంద్రన్, పనకుడి నగర కార్యదర్శి, యువజన విభాగం కార్యదర్శి, తిరునల్వేలి నగర జిల్లా జయలలిత పేరవై కార్యదర్శి, రాష్ట్ర జయలలిత పేరవై కార్యదర్శి, ఎన్నికల విభాగం సంయుక్త కార్యదర్శి తదితర పదవులు నిర్వహించారు.

విద్యుత్, కార్మికశాఖ మంత్రిగా...

2001 తిరునల్వేలి శాసనసభ నియోజకవర్గంలో అన్నాడీఎంకే తరఫున పోటీ చేసి విజయం సాధించి, నాటి ముఖ్యమంత్రి జయలలిత మంత్రివర్గంలో విద్యుత్, కార్మిక శాఖల మంత్రిగా పనిచేశారు. మళ్లీ 2006లో తిరునల్వేలి నియోజకవర్గంలో పోటీ చేసి పరాజయం పాలయ్యారు. 2011లో జరిగిన ఎన్నికల్లో తిరునల్వేలి నియోజకవర్గం నుంచి ఎన్నికైనా, ఆయనకు మంత్రి పదవి లభించలేదు.

బీజేపీలో చేరిక...

2016లో మళ్లీ తిరునల్వేలి నియోజకవర్గం నుంచి పోటీ చేసి పరాజయం పొందారు. జయలలిత మరణానంతరం అన్నాడీఎంకేలో ఏర్పడిన విభేదాల కారణంగా ఆ పార్టీ నుంచి వైదొలిగి 2017లో బీజేపీలో చేరారు. అప్పటినుంచి బీజేపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న ఆయన, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు. 2019లో రామనాథపురం పార్లమెంటు నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున పోటీచేసి పరాజయం చవిచూశారు. అనంతరం 2021లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో తిరునల్వేలి నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున పోటీచేసే అవకాశం దక్కింది. ఆయనకు మద్దతుగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రచారం చేశారు. ఈఎన్నికల్లో నయినార్ నాగేంద్రన్ విజయం సాధించి, బీజేపీ శాసనసభ పక్షనేతగా వ్యవహరిస్తున్నారు. 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తిరునల్వేలి పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన నాగేంద్రన్, కాంగ్రెస్ అభ్యర్థి రాబర్ట్ బ్రూస్ చేతిలో పరాజయం పాలయ్యారు.

సమాచార దర్శిని

తిరుచెందూర్ ఆలయ హుండీ ఆదాయం రూ.4.64 కోట్లు

పెరంబూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ మురుగన్ ఆలయ హుండీ లెక్కింపు రెండు రోజులుగా జరిగింది. ఆలయాన్ని దర్శించుకున్న భక్తులు స్వామివారికి రూ.4,64,95,186 నగదు, 1.740 కిలోల బంగారం, 30.450 కిలోల వెండి, 55.310 కిలోల ఇత్తడి, 9.6 కిలోల రాగి, 9.61 కిలోల తగరం, 1,530 విదేశీ కరెన్సీ నోట్లు కానుకలుగా సమర్పించారని ఆలయ అధికారులు తెలిపారు.

25న ఎన్‌ఎల్‌సీ కార్మిక సంఘం ఎన్నిక

పెరంబూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నైవేలీ ఎన్‌ఎల్‌సీ కార్మిక సంఘం ఎన్నిక ఈ నెల 25వ తేది జరగనుందని కార్మికుల ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఎన్‌ఎల్‌సీ ఇండియా సంస్థలో 12,000 మందికి పైగా కార్మికులు ఈ ఎన్నికల్లో ఓటు వేయనున్నారు. కార్మిక సంఘం ఎన్నికలు నాలుగేళ్లకు ఒకసారి నిర్వహిస్తుంటారు.

నేడు మోటో జాం అడ్వెంచర్ ఈవెంట్

పెరంబూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్, రెడ్‌బుల్, మొబైల్-1 తదితరాలు సంయుక్తంగా 'రెడ్ బుల్ మోటో జాం బైకర్' పేరుతో స్థానిక ఐల్యాండ్ గ్రౌండ్స్‌లో అడ్వెంచర్ ఈవెంట్ నిర్వహించనున్నాయి. దేశంలో ఇలాంటి ఈవెంట్ నిర్వహించడం ఇదే మొదటిసారి. ఇందులో సీనియర్ బైక్ స్టంట్‌మన్ అరస్ కిబిషా, గిన్నిస్ వరల్డ్ రికార్డు హోల్డర్ అబ్బుబెగాలి, గులాబ్ తదితరులు ఒళ్లుగగుర్పొడేలా విన్యాసాలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో బైక్, కారు డ్రిఫ్టింగ్, ఫ్రీస్టైల్ క్రాసింగ్ వంటి ఉత్కంఠభరితమైన సాహసాలు ప్రదర్శించనున్నారు.ఈకార్యక్రమం టిక్కెట్లు 'రెడ్ బుల్ మోటో జాం' వెబ్‌సైట్‌లో విక్రయిస్తున్నారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

పుస్తకాలు రాయడంపై ప్రభుత్వ ఉద్యోగులకు నిబంధనలు

పెరంబూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు పుస్తకాలు రాయడంపై పలు నిబంధనలు విధిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమాలు-1973 ప్రకారం, ఉద్యోగి ఏదైనా పుస్తకం ప్రచురించే ముందు అనుమతి పొందాలి. సాహిత్యం, చిన్న కథలు, నవలలు, నాటకాలు, వ్యాసాలు, కవిత్వంపై పుస్తకాలు రాసే ప్రభుత్వ ఉద్యోగి షరతులకు లోబడి ఉండాలన్ని నిబంధన ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు రాసే పుస్తకంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు ఉండకూడదు. అలాగే, శాంతి భద్రతలు ప్రభావితం చేసేలా అభ్యంతరకరమైన ప్రసంగం లేదని ప్రకటించాలి. ప్రచురణకర్త నుంచి పారితోషకం, రాయితీ పొందేందుకు సంబంధిత అధికారుల నుంచి అనుమతులు పొందాలని జీవోలో పేర్కొన్నారు.

టాస్మాక్ దుకాణాల్లో కొత్త బీర్లు

పెరంబూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ దుకాణాల్లో బీర్ల విక్రయాలు పెంచేలా కొత్త బీరు రకాలు పరిచయం చేయనున్నారు. రాష్ట్రంలో గత ఏడాది 10.88 లక్షల బీరు బాటిళ్ల విక్రయం కాగా, ఈ ఏడాది 7.97 లక్షలు మాత్రమే విక్రయమయ్యాయి. దుకాణాల్లో బీరు విక్రయాలు పెంచేలా టాస్మాక్ నిర్ణయించింది. ఆ ప్రకారం, ఇప్పటికే ఆంధ్రాకు చెందిన 'బ్లాక్ మాస్టర్' రకం కొత్త బీరు విక్రయాలు ప్రారంభమయ్యాయి. అలాగే, మధ్య ప్రదేశ్‌కు చెందిన 'బ్లాక్ ఫోర్ట్', 'వుడ్ పీకర్' తదితర కొత్త రకాలు త్వరలో విక్రయించనున్నట్లు అధికారులు తెలిపారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు శిక్షణ

పెరంబూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో పని చేస్తున్న రాష్ట్ర కెరీర్ గైడెన్స్ సెంటర్‌లో పాఠశాల, కళాశాలల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కౌన్సిలింగ్‌తో పాటు మార్గదర్శకాలు అందిస్తోంది. పోటీ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ తరగతులు, మోడల్ పరీక్షలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో, ఇటీవల గ్రూప్-1 పోస్టుల భర్తీకి టీఎన్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీచేసింది. ఆ ప్రకారం, గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు అనుభవజ్ఞులైన బోధకులచే తరగతులు నిర్వహించనున్నారు. స్థానిక గిండి తిరువిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని థాన్సీ భవనం, మొదటి అంతస్తులో ఉన్న రాష్ట్ర కెరీర్ గైడెన్స్ సెంటర్‌లో సోమవారం నుంచి శుక్రవారం వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు ఉంటాయి. వివరాలకు నెం.044-22500134, 9361566648లలో సంప్రదించవచ్చు.

ఐసిఎఫ్‌లో వందే భారత్ పార్శిల్ రైళ్ల తయారీ

పెరంబూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసిఎఫ్‌లో 'వందే భారత్ పార్శిల్ రైలు' తయారీ తుదిదశకు చేరుకుంది. గంటకు 160 కి.మీ వేగంతో వెళ్లే ఈ రైలులో, ఆహార పదార్థాలు, ఇతర వస్తువులు తరలించనున్నారు. తొలి వందే భారత్ పార్శిల్ రైలు సేవలు ముంబై, ఢిల్లీ మండలాల్లో ప్రారంభించే అవకాశముంది

నూతన బస్సు సర్వీసులు ప్రారంభం



తిరుత్తణి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి నుంచి ఆర్కేపేట, షోళింగర్, కేఎస్.కండ్రిగై తదితర ప్రాంతాల్లోని ప్రజల అభ్యర్థనల మేరకు శుక్రవారం ఉదయం ఆ ప్రాంత ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ బస్సు సర్వీసులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా సంక్షేమం కోసం రాష్ట్రప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. తిరుత్తణి ఐస్‌హౌస్ మేనేజర్ జ్ఞానశేఖరన్, డీఎంకే ప్రాంతీయ కార్యదర్శులు పళని, సెంగుట్టువన్, మోనిషా శరవణన్, పురుషోత్తమ్ పాల్గొన్నారు.

పార్టీలో యువతే కీలకం



తిరుత్తణి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి మండలానికి నూతనంగా నియమితులైన ఆదిద్రావిడ విభాగం, కార్మిక విభాగం, మత్స్యకార విభాగాల నూతన కార్యదర్శులు శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే ఎస్.చంద్రన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పార్టీకి యువత వెన్నెముక లాంటివారన్నారు. ఈ కార్యక్రమంలో పెరూర్ లీగ్ ఇన్‌ఛార్జి అన్బు అన్నన్, అడ్వకేట్ సీజే.సెంథిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను కించపరచడం డీఎంకే నేతలకు అలవాటే

● అన్నాడీఎంకే ఎమ్మెల్యే, మాజీ మంత్రి సెల్లూరు రాజు



ప్యారీస్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరిచేలా వ్యాఖ్యానించడం డీఎంకే నేతలకు అలవాటేనని అన్నాడీఎంకే ఎమ్మెల్యే, మాజీ మంత్రి సెల్లూరు రాజు పేర్కొన్నారు. మదురై పశ్చిమ శాసన సభ నియోజకవర్గంలోని ఏర్కుడి అచ్చపత్తులో అమ్మాపార్కు నిర్మాణానికి శుక్రవారం ఉదయం జరిగిన భూమిపూజలో సెల్లూరు రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్ముడిని డీఎంకే ఉపప్రధాన కార్యదర్శి పదవినుండి తొలగించిన అంశంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెబుతూ, మంత్రి పొన్ముడి మాత్రమే కాదు, డీఎంకే నేతల్లో పలువురు మహిళలకు వ్యతిరేకంగా, బడుగు బలహీన వర్గాల మహిళలను కించపరిచేలా వ్యాఖ్యానించడం అలవాటేనన్నారు. ఈ సంస్కృతి దివంగత ముఖ్యమంత్రి కరుణానిధి హయాం నుంచే టీవీ సీరియల్‌లా కొనసాగుతోందని విమర్శించారు. పొన్ముడికి వ్యతిరేకంగా ఉన్న ఆరోపణలు, ఫిర్యాదులు గతంలో కూడా ముఖ్యమంత్రి స్టాలిన్ దృష్టికి వెళ్ళినా పట్టించుకోలేదని, అయితే డీఎంకే ఎంపీ కనిమొళి పొన్ముడిని తీవ్రంగా విమర్శించినందువల్లే ఆయన్ను పార్టీ నుండి తప్పించారన్నారు. రాష్ట్రంలో ఎటుచూసినా అన్యాయం, అక్రమాలు, మహిళలపై లైంగిక వేధింపులు, మాధకద్రవ్యాల వినియోగం బాగా పెరిగిందని అందువల్ల డీఎంకే ప్రభుత్వంపై రాష్ట్రప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. 2026 ఎన్నికల్లో మళ్ళీ అన్నాడీఎంకే ఘన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని సెల్లూరు రాజు జోస్యం చెప్పారు.

అటవీ ప్రాంతాల్లో మావోయిస్టుల సంచారం లేదు

పెరంబూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లోని అటవీ ప్రాంతాల్లో మావోయిస్టుల సంచారం లేదని డీజీపీ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. విడుదల చేసిన ప్రకటనలో... గత 2013లో మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన ముచ్చదిప్పు అటవీ ప్రాంతంలో సాయుధదళ మావోయిస్టులు గుర్తించామన్నారు. అప్పటి నుంచి గ్రే హౌండ్స్, నక్సల్ నిరోధక విభాగం, క్యూ బ్రాంచ్ సహా పలు ప్రత్యేక దళాలు ముమ్మరంగా కూంబింగ్ చేపట్టాయని తెలిపింది. ప్రస్తుత డీజీపీ శంకర్ జివాల్ ఉత్తర్వులతో, ఐజీ మయిల్ వానన్ నేతృత్వంలో కేరళ రాష్ట్రం వయనాడు, కర్ణాటక రాష్ట్రం చామ్‌రాజ్‌నగర్, రాష్ట్రంలోని నీలగిరి జిల్లాలోని రెండు ప్రాంతాల్లో కొద్దిరోజులుగా ప్రత్యేక దళాలు కూంబింగ్‌లో పాల్గొన్నాయని తెలిపారు. ఈ ప్రాంతాల్లో మావోయిస్టుల సమాచారం లేదని తెలిసిందని, అదే సమయంలో ఆయా ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగుతాయని డీజీపీ కార్యాలయం తెలిపింది.

కలైంజర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.2 లక్షల ఆర్థిక సాయం

పెరంబూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కలైంజర్ కరుణానిధి ట్రస్ట్ ఆధ్వర్యంలో 8 మందికి విద్య, వైద్యం కోసం తలా రూ.25 వేల చొప్పున రూ2 లక్షలను సీఎం స్టాలిన్ అందజేశారు. కలైంజర్ కరుణానిధి ట్రస్ట్ కోసం కరుణానిధి అందజేసిన రూ5 కోట్ల డిపాజిట్‌పై వచ్చే వడ్డీని ప్రతినెలా పేద కుటుంబాలకు అందిస్తుంటారు. 2005 నుంచి ఇప్పటివరకు రూ.6.21 కోట్లు వైద్యం, విద్య సాయం కోసం అందజేసినట్లు డీఎంకే ప్రధాన కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

కేరళ లాటరీలో సేలం వ్యక్తికి రూ.10 కోట్లు

ప్యారీస్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలో వేసవి సీజన్ బంపర్ లాటరీలో సేలం వ్యక్తికి రూ.10 కోట్లు బహుమానం వచ్చినట్లు ప్రకటించారు. కేరళలో పండుగ సీజన్‌లో లాటరీ టికెట్ల విక్రయాలు బాగా పెరుగుతుంటాయి. వేసవి సీజన్ బంపర్ లాటరీ విక్రయాలను సంబంధించిన డ్రా ఈ నెల 2న జరిగింది. ఇందులో రూ.250 ధర టికెట్టు ఎస్‌జీ513715 అనే నెంబరుకు రూ.10 కోట్లు నగదు బహుమానం వచ్చింది. ఈ లాటరీ టికెట్టు పాల్ఘాట్‌లో ఉన్న కింగ్‌స్టార్ లాటరీ ఏజెన్సీ నుంచి కొనుగోలు చేసినట్లు తెలిసింది. అయితే డ్రా ఫలితాలు ప్రకటించి 8 రోజులు గడుస్తున్నా ఆ అదృష్ట జాతకుడెవరన్న విషయం తెలియలేదు. ఈ నేపథ్యంలో తమిళనాడుకు చెందిన ఓ ఏజెంట్ 150 కేరళ లాటరీ టికెట్లను కొనుగోలు చేయగా, అందులో ఓ టికెట్టుకు రూ.10 కోట్ల నగదు బహుమతి వచ్చిన విషయం తెలుసుకున్న సంబంధిత వ్యక్తి నేరుగా కేరళకు వెళ్ళి లాటరీ ఏజెంటును సంప్రదించాడు. తాను కొనుగోలు చేసిన టికెట్టును సమర్పించి నగదు బహుమతి పొందినట్లు సమాచారం. తమిళనాడులో లాటరీని నిషేధించినందువల్ల తన వివరాలేవి వెల్లడించరాదని ఆ సేలం వ్యక్తి కేరళ లాటరీ సంస్థకు విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది.

రూ.6.46 కోట్లతో అభివృద్ధి పనులు



వేలూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దేశింగురాజా, రాణిబాయ్‌ల జ్ఞాపకార్థం రాష్ట్రప్రభుత్వం రూ.6.46 కోట్లతో రాణిపేట మున్సిపాలిటీలోని పోలూరు వద్ద జరుగుతున్న పలు అభివృద్ధి పనులను శుక్రవారం ఉదయం రాష్ట్ర చేనేత శాఖ మంత్రి గాంధీ పరిశీలించారు. అదేవిధంగా పోలూరులోని వివిధ గ్రామాల్లోని డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు తదితర సదుపాయాలతో పాటు దేశింగురాజా, రాణి భాయ్‌ల విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇంజనీర్లు మణికంఠన్, పీడబ్ల్యూ ఇంజనీర్ నారాయణమూర్తి, త్రిపుర సుందరి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మంత్రి దురైమురుగన్ క్షమాపణ

ప్యారీస్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను కించపరచే విధంగా వ్యాఖ్యానించిన రాష్ట్ర సీనియర్ మంత్రి దురైమురుగన్ తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అలాగే దివ్యాంగులకు బేషరతుగా క్షమాపణలు తెలిపారు. ఇటీవల ఓ బహిరంగ సభలో పాల్గొన్న మంత్రి దురైమురుగన్ తన ప్రసంగంలో దివ్యాంగుల గురించి ప్రస్తావించడం వివాదాస్పదమైంది. దీనిపై సోషల్ మీడియాలో కూడా కోడై కూసింది. ఇదిలా వుండగా శుక్రవారం మంత్రి దురైమురుగన్ భవిషత్తులో దివ్యాంగులను కించపరచే విధంగా మాట్లాడబోనని, వారికి క్షమాపణలు తెలియజేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి



పరిసరాలను శుభ్రం చేసిన బృందం

తిరుత్తణి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని వీరట్టీశ్వరాలయంలో డాక్టర్ ఆర్.రంజిత్ కుమార్ అధ్యక్షతన పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది పనుల్లో పాల్గొని ఆలయ పరిసరాలను శుభ్రపరిచి, ప్రజలకు అవగాహన కల్పించారు.

డ్రోన్ ద్వారా తేయాకు తోటల్లో మందుల పిచికారీ



డ్రోన్‌లో మందులు నింపుతున్న కూలీ

పెరంబూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా వాల్పారైలో అధికంగా తేయాకు తోటలున్నాయి. ఇటీవల తోటల్లో ఆకులు కోయడం, కలుపు మొక్కల తొలగింపు, పురుగు మందుల పిచికారీ తదితర పనులకు కార్మికుల కొరత ఏర్పడింది. దాన్ని అధికమించేలా తేయాకు తోటల యజమానులు పలు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రీన్ ఆయిల్ సేకరణకు బ్యాటరీతో నడిచే యంత్రాలు పరిచయం చేశారు. ఈ నేపథ్యంలో, తేయాకు తోటల్లో మందులు చల్లేందుకు తొలిసారిగా డ్రోన్‌ను ప్రారంభించారు. పందలూరు సమీపం సేరంబాడిలోని ఓ తేయాకు తోటలో డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారీ చేపట్టారు. ఆంధ్ర రాష్ట్రం నుంచి తీసుకొచ్చిన డ్రోన్లు, వాటి ఆపరేటర్ల సాయంతో ఉదయం, సాయంత్రం వేళల్లో మందులు పిచికారీ చేస్తున్నారు. 10 లీటర్ల సామర్థ్యం కలిగిన డ్రోన్ గంటలో 25 ఎకరాల్లో మందులు పిచికారీ చేస్తుంది. ఈ విధానం త్వరలో పక్కనున్న తోటల్లో కూడా చేపట్టనున్నట్లు వాటి యజమానులు తెలిపారు.

కోలాహలంగా జల్లికట్టు



ఎద్దులను అదుపు చేస్తున్న యువకులు

పెరంబూర్, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా పాపినాయకన్‌పట్టి కాళియమ్మన్ ఆలయ పంగుని పొంగల్ వేడుకల్లో భాగంగా శుక్రవారం జల్లికట్టు పోటీలు కోలాహలంగా సాగాయి. ఉసిలంపట్టి ఆర్డీవో షణ్ముగ వడివేలు, డీఎస్పీ కార్తికేయన్, పశు వైద్య శాఖ సహా పలు శాఖల అధికారులు, గ్రామస్థుల సమక్షంలో ఈ పోటీ సాగింది. మదురై, దిండుగల్, తేని, శివగంగ, విరుదునగర్ ప్రాంతాల నుంచి 624 ఎద్దులు, 420 మంది యువకులు బరిలో నిలిచారు. కానీ, నిర్ణీత సమయం మధ్యాహ్నం 3.30 గంటలకు పోటీ ముగియగా, 576 ఎద్దులు బరిలో నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులు, ఎద్దులను అదుపుచేసిన క్రీడాకారులకు బీరువా, మంచం, సైకిల్ సహా పలురకాల వస్తువులు బహుమతులుగా అందజేశారు. కాగా, ఎద్దులు అదుపుచేసే క్రమంలో 51 మంది క్రీడాకారులకు గాయాలయ్యాయి.

కష్టపడి ముందుకెళ్లండి

● జాబ్ మేళాలో కలెక్టర్ సుబ్బులక్ష్మి



నియామకపత్రాలు అందిస్తున్న కలెక్టర్

వేలూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జీవితంలో కష్టపడి ముందుకెళ్లాలని యువతకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. వేలూరులోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నగర ఉపాధి శిక్షణ శాఖ, టాన్‌సన్ సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం గుడియాత్తంలోని రాజగోపాల్ పాలిటెక్నిక్‌లో మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నిరుద్యోగుల కోసం ఇలాంటి జాబ్‌మేళాలను నిర్వహిస్తున్న టాన్‌సమ్ సంస్థను అభినందించారు. ఈ మేరకు కలెక్టర్ జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందిన వారికి నియామకపత్రాలను అందించారు. తహసీల్దారు శుభలక్ష్మి, ప్రభుత్వ అధికారి గాంధీ, షాన్‌బాషా ఖాన్, జిల్లా శిక్షణ అధికారి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో గ్రంథాలయాల్ని పూర్తి చేయండి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే కలెక్టర్

వేలూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వేలూరు జిల్లా గుడియత్తం, కేవీకుప్పం, కాట్పాడి తదితర ప్రాంతాల్లోని కళాశాలల్లో గ్రంథాలయాలను నిర్మించేందుకు రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు గుడియత్తం కళాశాల ప్రాంగణంలో రూ.22 లక్షలతో నిర్మించనున్న లైబ్రరీ నిర్మాణ పనులను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వ అధికారులతో మాట్లాడి నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గుడియత్తం ఎమ్మెల్యే అమ్ములు విజయన్, డీఎంకే ప్రముఖుడు సౌందరరాజన్ తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కోవిల్ సమీపంలో రైలు పట్టాల కింద తవ్వకాలు

మట్టిపెళ్లలు జారిపడి ముగ్గురికి గాయాలు



రైలు పట్టాల కింద కార్మికులు తవ్విన గొయ్యి

చెన్నై, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కోవిల్ జంక్షన్, నాగర్‌కోవిల్ నగరం మధ్యనున్న రైలు పట్టాల దిగువన చెరువు నీళ్లు ప్రవహించేందుకు తవ్వకాలు జరుపుతుండగా మట్టి పెళ్లలు విరిగి పడటంతో ముగ్గురు కార్మికులు గాయపడ్డారు. ఈ సంఘటన కారణంగా ఆ మార్గంలో రైళ్ళ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పాత రైలు పట్టాలను మార్చి కొత్త పట్టాలు ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయి. అదే సమయంలో రైలు మార్గానికి సమీపంలో ఉన్న చెరువు నీటితో నిండినప్పుడల్లా పట్టాలు ముంపునకు గురవుతున్నాయి. ఆ చెరువునీళ్లు ప్రవహించడానికి అనువుగా పట్టాలు దిగువన భారీ పైప్‌లైన్లు ఏర్పాటు చేసే పనులు కూడా జరుగుతున్నాయి. రైళ్ల రాకపోకలు లేని గురువారం రాత్రి 11 నుండి శుక్రవారం వేకువజాము 3 గంటల లోపున పట్టాల దిగువన పైప్‌లైన్ల ఏర్పాటుకు యంత్రాలతో తవ్వకాలు చేపట్టారు. సుమారు 10 మంది కార్మికులు పట్టాలను తొలగించి 12 అడుగుల లోతున గోతిని తవ్వారు. వేకుజాము 2.15 గంటలకు ఉన్నట్టుండి మట్టిపెళ్లలు జారి పడటంతో కోయంబత్తూరుకు చెందిన జానకిరామన్, పాళయంకోటకు చెందిన సింగరాజా, మదురైకి చెందిన బాలకృష్ణన్ గాయపడ్డారు. వెంటనే తక్కిన కార్మికులు ఆ ముగ్గురిని కాపాడేందుకు చర్యలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న రైల్వే శాఖ ఉన్నతాధికారులు కూడా హుటాహుటిన అక్కడికి చేరుకుని అంబులెన్స్‌ను రప్పించి ముగ్గురినిచికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనితో తవ్వకాలను నిలిపివేసి రైలు మార్గాన్ని పునరుద్ధరించే పనులు ప్రారంభించారు. చెన్నై, బెంగళూరు, కోయంబత్తూరు నుండి వచ్చిన రైళ్లు నాంగునేరి, మేల్‌పాళయం, తిరునల్వేలి, కోవిల్‌పట్టి వద్ద నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడగా, ఆరుగంటల తర్వాత ఈ రైళ్లన్నీ ఒకదాని వెనుక ఒకటిగా వరుసగా బయలుదేరాయి.

అమిత్‌షా రాకపై కాంగ్రెస్ నిరసన

● 250 మంది అరెస్ట్



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ప్యారీస్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని నగరం చెన్నైకు విచ్చేసిన కేంద్రమంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా నలుపు రంగు బెలూన్లను ఎగురవేసి, ధర్నా జరిపిన 250 మందికి పైగా కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. కేంద్ర హోం మంత్రి షా రెండ్రోజుల పర్యటన కోసం గురువారం సాయంత్రం నగరానికి విచ్చేసి శుక్రవారం వరకు జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి నిధుల కేటాయింపులో పక్షపాత వైఖరి చూపడం, పార్లమెంటులో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ని కించపరిచేలా మాట్లాడడంపై తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ)అధ్యక్షుడు సెల్వపెరుందగై నేతృత్వంలో శుక్రవారం స్థానిక మైలాపూర్ డాక్టర్ అంబేడ్కర్ వంతెన సమీపంలో నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేశారు. ముందుగా నలుపు రంగు పావురాన్ని ఎగురవేసిన అనంతరం సెల్వపెరుందగై మాట్లాడుతూ.. తమిళనాడుపై చిన్నచూపు చూస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా రాష్ట్రానికి ఎప్పుడు వచ్చినా తాము నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ ధర్నాలో మాజీ ఎంపీ పీటర్ అల్ఫోన్స్, ఎమ్మెల్యేలు హసన్ మౌలానా, దురైచంద్రశేఖర్, విల్లివాక్కం సురేష్, అరుంబాక్కం వీరపాండ్యన్ సహా 250 మందికి పైగా పాల్గొన్నారు. అనుమతి లేకుండా ఆందోళన చేపట్టిన వీరిని పోలీసులు అరెస్టు చేశారు.

గొంతులో చిక్కుకున్న చేప

శ్వాస తీసుకోలేక యువకుడి మృతి

పెరంబూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఊహించని విధంగా బతికిన చేప గొంతులోకి వెళ్లి శ్వాస తీసుకోలేక యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన స్థానిక మధురాంతకంలో జరిగింది. మధురాంతకానికి చెందిన మణికంఠన్ (29) స్నేహితులతో కలసి సమీపంలోని కీళవలవు చెరువులో చేపలు పడుతుంటాడు. ఘటన జరిగిన రోజున మణికంఠన్ ఒక్కడే వేటకు వెళ్లాడు. అతని వద్ద గాలాలు, వలలు లేకపోవడంతో చేతులతోనే చేపలు పట్టాలని నిర్ణయించుకున్నాడు. నీరు తక్కువగా ఉన్న ప్రాంతానికి వెళ్లిన మణికంఠన్‌కు ఒకేసారి రెండు చేపలు చిక్కాయి. చేపలు బతికుండి గిలగిలా కొట్టుకుంటుండగా, రెండింటిని చేతిలో పట్టుకోలేని అతను, ఒక చేపను నోటి మందు పళ్ల మధ్య పెట్టుకొని, మరో చేపను చేతిలో పట్టుకున్నాడు. ఊహించని విధంగా పళ్ల మధ్య ఉన్న చేప నోటిలోకి వెళ్లి, అక్కడి నుంచి గొంతులోకి వెళ్లింది. దీంతో, శ్వాస తీసుకొనేందుకు ఇబ్బంది పడిన మణికంఠన్, హుటాహుటిన చెరువు నుంచి బయటకు వచ్చి ఇంటికెళ్లాడు. కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు నోట్లో చిక్కిన చేపను వెలికితీసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోగా, అతను స్పృహతప్పాడు. అతన్నివెంటనే చెంగల్పట్టు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

తొమ్మిదో తరగతి విద్యార్థిని అశ్లీల చిత్రాలు

● షేర్ చేసిన ప్రియుడి సహా ఐదుగురి అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదవ తరగతి విద్యార్థిని అశ్లీల చిత్రాలు షేర్ చేసిన వ్యవహారంలో ప్రియుడు సహా ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుపత్తూర్ జిల్లాకు చెందిన 18 ఏళ్ల యువకుడు 9వ తరగతి విద్యార్థినితో ఆరు నెలలుగా ప్రేమలో ఉన్నాడు. ఇరువురు సెల్‌ఫోన్‌లో గంటల కొద్దీ మాట్లాడుకునేవారు. ఒకానొక సమయంలో అర్ధనగ్నంగా ఉన్న ఫోటోలు తీసి తనకు పంపించాలని, తాను వాటిని సెల్‌ఫోన్‌లో భద్రంగా ఉంచుకుంటానని యువకుడు చెప్పిన మాటలు నమ్మిన విద్యార్థిని వాటిని పంపించింది. వాటిని యువకుడు తన స్నేహితులకు షేర్ చేసినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు యువకుడి సహా అతని స్నేహితులను కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు బాంబు బెదిరింపు

పెరంబూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ వచ్చిన బాంబు బెదిరింపు కలకలం రేపింది. ఈ స్టేషన్ ప్రాంగణంలో పార్శిల్ కార్యాలయానికి వచ్చిన ఈ-మెయిల్‌లో బాంబు బెదిరింపు చోటుచేసుకుంది. ఈ విషయాన్ని పార్శిల్ కార్యాలయ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు జాగిలం, మెటల్ డిటెక్టర్లతో రైల్వే, స్థానిక పోలీసులు సంయుక్తంగా స్టేషన్‌లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి, బాంబు బెదిరింపు ఉత్తుత్తిదే అని తేల్చారు. ఈ-మెయిల్ పంపిన చిరునామా కోసం పోలీసులు విచారణ చేపట్టారు.

జుట్టు రాలిపోతుందనే బాధతో విద్యార్థి ఆత్మహత్య

పెరంబూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జుట్టు తరుచూ రాలిపోతుండడంతో మనస్తాపం చెందిన విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తిరుప్పూర్ జిల్లా చెట్టిపాళయానికి చెందిన బాలుస్వామి, సులోచన దంపతులకు విష్ణు, కృతీశ్వరన్ (15) కుమారులున్నారు. విష్ణు ప్లస్ టూ పరీక్షలు రాయగా, కృతీశ్వరన్ 9వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం వార్షిక పరీక్షలు ముగిసిన నేపథ్యంలో, బుధవారం కృతీశ్వరన్ ఇంట్లో ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని కృతీశ్వరన్ రాసిన సూసైట్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. అందులో... 'నాకు జుట్టు రాలే సమస్య ఉంది. అధికంగా జుట్టు రాలుతుండడంతో చూసేందుకు అసహ్యంగా కనిపిస్తుండడంతో, జీవించేందుకు ఇష్టం లేక ఆత్మహత్యకు పాల్పడుతున్నా' కృతీశ్వరన్ సూసైట్ నోట్‌లో పేర్కొన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురు యువకుల మృతి

● ఒకే బైక్‌పై వస్తుండగా ఘటన



ఆస్పత్రిలో మృతదేహాలు

పెరంబూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆటోను ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో నలుగురు యువకులు మృత్యువాత పడ్డారు. నీలగిరి జిల్లా మేట్టుపాళయం సమీపం కారమడైకి చెందిన నిజూ(22), విధున్(17), నకులన్(17), వినోద్ ఒకే ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. అతివేగంగా వెళ్తున్న బైక్ హఠాత్తుగా అదుపు తప్పి ప్రయాణికుల ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో నిజూ, విధున్, నకులన్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా, వినోద్ ఆస్పత్రిలో చికిత్సలు ఫలించక మృతి చెందాడు. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ లింగేశ్వరన్, ఆటోలో ప్రయాణిస్తున్న పొట్టమ్మాల్, పూవిత, సౌందర్య, మంగమ్మాళ్ తదితరులకు గాయపడగా, వారిని మేట్టుపాళయం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆగిన లారీని ఢీకొన్న అంబులెన్స్

● ఇద్దరి మృతి



రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని అంబులెన్స్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందగా, మరికొందరికి గాయాలయ్యాయి. తంజావూరు జిల్లా పట్టుకోటకు చెందిన మురుగన్ అనారోగ్యంగా ఉండడంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో కోవైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. గురువారం వేకువజామున పల్లడం మార్గంగా వస్తున్న అంబులెన్స్ రోడ్డు పక్కనే నిలిపి ఉన్న లారీని వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో మురుగన్ ఘటనా స్థలంలోనే మృతిచెందగా, ఆయన భార్య కల్యాణి, కుమార్తె కవిత, అంబులెన్స్ డ్రైవర్ సహా నలుగురికి గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు అంబులెన్స్ నుంచి క్షతగాత్రులను రక్షించి పల్లడం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్సలు ఫలించక కల్యాణి మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి చేపట్టిన ప్రాథమిక విచారణలో... డ్రైవింగ్ లైసెన్స్ లేని కవిఅరసన్ (19) అంబులెన్స్ నడిపినట్లు తెలిసింది.



తయారు చేసిన ప్రతిమలతో రాజేశ్వరి



విభూది తయారీలో మహిళలు

మనసుంటే మార్గాలెన్నో...

- దేవుడి ప్రతిమలు, విభూది తయారీ
- ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా రాణిస్తున్న రాజేశ్వరి

తరుణి

చెన్నై, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఒకరి సంపాదనతో కుటుంబాన్ని నెట్టుకురాలేని ఈ రోజుల్లో భార్యాభర్తలు ఉద్యోగాలకు వెళ్లి పోటీపడి సంపాదించినా కుటుంబ ఖర్చులు, ఆడంబరాలకు జీతాలూ చాలకున్నాయి. ఈ పరిస్థితుల్లో నెలాఖరున అప్పు చేయాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. రోజూ ఉదయం ఆఫీసుకు బయలుదేరి, సాయంత్రం ఇళ్లకు చేరుకున్నా అలసిపోయి నాలుగు మెతుకులు తిని పడుకునేలా జీవితం యాంత్రికమవుతోంది. ఇలాంటి పరిస్థితులు తన కుటుంబంలో రాకూడదని కంకణం కట్టుకుని ఓ మహిళ స్వయం ఉపాధిగా దేవతా మూర్తుల ప్రతిమలు, విభూది తయారీలో ప్రతిభాపాటవాలను ప్రదర్శించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా ఉన్నతస్థితికి చేరుకుంది. ఆ మహిళ పేరు రాజేశ్వరి. నాగపట్టినం సమీపం సిక్కిల్‌లో నివసిస్తున్నారు. పదిమందికి పైగా మహిళలకు ఉపాధి కల్పిస్తున్న రాజేశ్వరి ప్లస్‌-2 దాకా చదివింది. భర్త గోపాలకృష్ణన్‌ ప్రైవేటు కంపెనీ ఉద్యోగి. సిక్కిల్‌లో సుప్రసిద్ధ సింగారవేలర్‌ (సుబ్రహ్మణ్యస్వామివారి) ఆలయం ఉంది. ఆ ఆలయానికి కూతవేటు దూరంలోనే ఈ భార్యాభర్తలు నివసిస్తున్నారు.

సంపాదన చాలకే...

స్వయం ఉపాధితో ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా మారడానికి భర్త సంపాదన చాలకపోవడమే కారణమని రాజేశ్వరి చెప్పుకొచ్చారు. ఒకరి సంపాదనతో కుటుంబాన్ని నెట్టుకురావటం కష్టమని భావించే ప్లస్‌-2 దాకా చదివిన తాను స్వయం ఉపాధిపై దృష్టి సారించానన్నారు. ఇంటిపట్టునే ఉంటూ ఏదైనా వ్యాపారం చేయాలని అనుకున్నానని, ఆ సమయంలో తమ వీధికి సమీపంలో సుప్రసిద్ధ సింగారవేలర్‌ ఆలయం ఉండటంతో దేశం నలుమూలల నుంచి విచ్చేసే భక్తులకు ఉపయోగపడే వస్తువులు తయారు చేసి విక్రయించాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. ఏ వస్తువులు తయారు చేయాలా అని దీర్ఘాలోచనలో ఉన్నప్పుడు, మురుగప్పెరుమాన్‌, పరమేశ్వరుడు, లక్ష్మీదేవి, సరస్వతీదేవి తదితర దేవతా మూర్తుల ప్రతిమలను తయారు చేయమని సలహా ఇచ్చారని, అలా తయారైన బొమ్మలు మన్నికగా బొమ్మల కొలువు పెట్టడానికి కూడా ఉపయోగపడేలా ఉండాలని తాను నిర్ణయించానన్నారు. అన్నింటికంటే ముందు దేవతామూర్తులను మట్టి, పింగాణీ మిశ్రమంతో తయారు చేసే పద్ధతులలో శిక్షణ పొందానని, అటుపిమ్మట జిల్లాలోని సుప్రసిద్ధ ఆలయాల్లో దేవతామూర్తుల బొమ్మలను అందంగా తయారు చేసి విక్రయించానని చెప్పారు. అదే సమయంలో కుటీర పరిశ్రమగా ఉన్న ఈ బొమ్మల తయారీని భారీ స్థాయికి చేర్చాలని నిర్ణయించి రుణాల కోసం బ్యాంకుల వద్దకు వెళితే బొమ్మల తయారీకి లోనా అంటూ హేళనగా మాట్లాడారన్నారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక మహిళా సంఘాల కోసం నిర్వహిస్తున్న 'వాయ్‌న్డు కాట్టువోమ్‌' పథకం ద్వారా రుణాలు పొందే అవకాశాలు ఉన్నట్లు తెలియటంతో ఆ పథకం నిర్వాహకులను కలిసి రూ.4.30లక్షల పొంది, మోల్డింగ్‌ యంత్రాలు, విడిభాగాలు కొనుగోలు చేసి వ్యాపారాన్ని విస్తరించానని రాజేశ్వరి తెలిపారు. ప్రస్తుతం బొమ్మల విక్రయం ద్వారా నెలకు రూ.25 వేల నుంచి రూ.30వేల దాకా లాభం వస్తోందని ఆ లాభమూ, భర్త సంపాదనను కలుపుకుని కుటుంబాన్ని చక్కగా పోషించుకోగలుగుతున్నామన్నారు. పిల్లలను బాగా చదివించే స్థాయికి చేరుకున్నామని, జీవనయానం సాఫీగా సాగుతోందని రాజేశ్వరి సగౌర్వంగా చెప్పారు.



విభూదిని శుభ్రపరస్తున్న మహిళలు

విభూది తయారీలో...

దేవుడి ప్రతిమలు విక్రయాలు పుంజుకున్న తర్వాత కొంత మంది మహిళలతో కలిసి విభూది తయారీని చేపట్టామన్నారు. పదిమంది మహిళలు కలిసి తలా రూ.1000 పెట్టుబడితో దిండుగల్‌ జిల్లా ఆత్తూరు సమీపం పిత్తలైపట్టిలో స్వచ్ఛమైన విభూదిని తయారు చేస్తున్నామని తెలిపారు. స్వదేశీ పశువుల పేడ, తవుడు, కర్పూరం, సాంబ్రాణి వంటి వస్తువులతో విభూది తయారు చేస్తున్నామన్నారు. తొలుత గ్రామంలోని ఆలయాలకు విభూది సరఫరా చేశామని, అది బాగుండడంతో ఇతర ప్రాంతాల్లోని ఆలయ నిర్వాహకులు తమ వద్దకు కొనుగోలు చేశారని తెలిపారు. ఆ తర్వాత రూ.75 వేలను రుణంగా పొంది విభూది ఉత్పత్తిని పెంచామన్నారు. పశువుల పేడను ఐదు రోజులపాటు ఎండలో ఆరబెట్టిన తర్వాతే విభూది తయారీకి వాడేవాళ్లమని, ప్రస్తుతం సోలార్‌ డ్రయర్లను ఉపయోగించి రెండు రోజులలోనే పశువుల పేడను ఆరబెట్టి విభూదిని వీలయినంత త్వరగా తయారు చేస్తున్నామన్నారు. విభూదిని తయారు చేస్తున్నప్పుడు అందరూ పీపీ కిట్‌లను ఉపయోగిస్తున్నామని, విభూదిని జిప్‌లాక్‌ ప్యాకెట్లలో పార్శిల్‌ చేసి ఇస్తున్నామని వివరించారు. ప్రస్తుతం తామంతా మహిళా స్వయం సహాయక సంఘంగా ఏర్పడి 125 కిలోల దాకా విభూదిని తయారు చేస్తున్నామన్నారు. పళని మురుగన్‌ ఆలయం, మదురై మీనాక్షి ఆలయం, పాపనాశం, చెన్నై వడపళని మురుగన్‌ ఆలయం, విరాలిపట్టి సాయిబాబా ఆలయం వంటి సుప్రసిద్ధ ఆలయాలకు విభూదిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఈ విభూతి విక్రయాలతో నెలకు రూ.20వేల నుంచి రూ.40వేల దాకా ఆదాయం వస్తోందని రాజేశ్వరి చెప్పారు. మనసుంటే ఎన్నో మార్గాలని, మన తలంపులు మంచివైతే స్వయం ఉపాధిలో రాణించగలమని, వృత్తిలో నాణ్యతను పాటించాలని ఇవే నేటి యువతులకు తానిచ్చే సలహా అని ఆమె అన్నారు.



సుగంధ ద్రవ్యాలతో తయారైన విభూది

పెర్‌ప్లెక్సిటీ ప్రధాన కార్యాలయంలో కమల్‌

కృత్రిమమేధ (ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌-ఏఐ) ఆధారిత సెర్చ్‌ ప్లాట్‌ఫాం పెర్‌ప్లెక్సిటీ ప్రధాన కార్యాలయాన్ని అగ్రనటుడు కమలహాసన్‌ సందర్శించారు. ప్రస్తుతం శాన్‌ఫ్రాన్సిస్కో పర్యటనలో ఉన్న ఆయన సిలికాన్‌ సిటీలోని ఈ కార్యాలయానికి వెళ్లి, ఆ కంపెనీ సీఈవో అరవింద్‌ శ్రీనివాస్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశం దేశ సరిహద్దులను చెరిపివేయడంతో పాటు ఉమ్మడి అభిరుచిని ప్రతిబింబిస్తుందని వారు పేర్కొన్నారు. భారతీయ సినిమాలో దశాబ్దాలుగా విప్లవాత్మక మార్పులకు కృషి చేసిన నటుడుగా పేరుగాంచిన కమలహాసన్‌.. కృత్రిమ మేధ టెక్నాలజీ కీలక భూమికను పోషించిన అరవింద్‌ శ్రీనివాసన్‌ను కలుసుకుని, ప్రత్యేకంగా అభినందించారు. ఈ విషయంపై కమల్‌ ట్వీట్‌ చేస్తూ... 'సినిమా నుంచి సిలికాన్‌ వరకు.. శాన్‌ఫ్రాన్సిస్కోలోని పెర్‌ప్లెక్సిటీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించడం సరికొత్త అనుభూతి కలిగించింది. ఇక్కడ కంపెనీ సీఈవో అరవింద్‌ శ్రీనివాస్‌తో పాటు భవిష్యత్‌ను నిర్మించే ఏఐ బృందాన్ని కలుసుకోవడం ఎంతో సంతోషంగా, ఆనందంగా ఉంది' అని పేర్కొన్నారు.



'పెర్‌ప్లెక్సిటీ' సీఈవో అరవింద్‌ శ్రీనివాస్‌తో కమలహాసన్‌

తమిళ చిత్రజ్యోతి

అసిస్టెంట్‌ డైరెక్టర్లు కావాలంటూ ట్వీట్‌

- స్పందించిన 15 మంది ఔత్సాహికులు

ప్రదీప్‌ రంగనాథన్‌, అనుపమ పరమేశ్వరన్‌, కయదు లోహర్‌ నటించిన 'డ్రాగన్‌' వంటి బ్లాక్‌బస్టర్‌ హిట్‌ని రూపొందించిన యువ దర్శకుడు అశ్వత్‌ మారిముత్తు వద్ద అసిస్టెంట్‌ దర్శకులుగా పనిచేసేందుకు ఆసక్తి చూపుతూ ఏకంగా 15మంది ఔత్సాహిక యువ అసిస్టెంట్‌ దర్శకులు ఈమెయిల్‌ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై అశ్వత్‌ ఎక్స్‌ వేదికగా స్పందిస్తూ... 'మా బృందం మీరు పంపిన విన్నపాలను పరిశీలించే పనిలో నిమగ్నమై ఉంది. గతంలో పదిమందిని అసిస్టెంట్లుగా ఎంపిక చేశాను. ఇపుడు నేను దర్శకత్వం వహించనున్న మరో రెండు చిత్రాలకు 20 మంది అసిస్టెంట్ల ఎంపికలో నిమగ్నమై ఉన్నాం' అని పేర్కొన్నారు. కాగా, విజయ్‌ సేతుపతి, అశోక్‌ సెల్వన్‌ కాంబినేషన్‌లో వచ్చిన 'ఓ మై కడవులే' ద్వారా దర్శకుడిగా పరిచయమైన అశ్వత్‌ మారిముత్తు ఇటీవల 'డ్రాగన్‌'తో మరో బ్లాక్‌బస్టర్‌ హిట్‌ని తన ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం హీరో సింబును డైరెక్ట్‌ చేయనున్నారు.



అశ్వత్‌ మారిముత్తు

TAMIL FILM PRODUCERS COUNCIL

టీఎఫ్‌పీసీ లోగో

ఆర్‌కే సెల్వమణికి టీఎఫ్‌పీసీ హెచ్చరిక


- పోలీసులకు ఫిర్యాదు

దక్షిణ భారత సినీ నిర్మాణ కార్మికుల సంఘ సమాఖ్య ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్‌.కె.సెల్వమణికి తమిళ చిత్ర నిర్మాతల మండలి (టీఎఫ్‌పీసీ) హెచ్చరిక చేసింది. తమిళ చిత్రపరిశ్రమకు చెందిన నిర్మాతలు రెండుగా విడిపోవడాన్ని తనకు అనుకూలంగా మార్చుకుని అసత్య ఆరోపణలు చేస్తున్నారంటూ టీఎఫ్‌పీసీ నిర్వాహకులు ఈ అంశంపై నగర పోలీస్‌ కమిషనరేట్‌లో ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులుగా ఫెఫ్సీకి - టీఎఫ్‌సీఏకు మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకున్న విషయం తెల్సిందే. ఇరు వర్గాల నేతలు ఒకరిపై ఒకరు పరస్పర ఆరోపణలు, విమర్శలు గుప్పించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం జరిగిన విలేకరుల సమావేశంలో ఆర్‌కే సెల్వమణి.. టీఎఫ్‌సీఏపై ఆరోపణలు చేశారు. వాటిని టీఎఫ్‌సీఏ నిర్వాహకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. ఈ నేపథ్యంలో టీఎఫ్‌సీఏ పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఇందులో అసోసియేషన్‌ సమస్యలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. నిర్మాతల సంఘం రెండుగా విడిపోవడాన్ని అనుకూలంగా మలచుకున్న ఆర్‌కే సెల్వమణి తద్వారా లాభం పొందాలని చూస్తున్నారని పేర్కొంది. టీఎఫ్‌సీఏ ప్రారంభించిన సినీ నిర్మాణ కార్మికుల సంఘాన్ని హేళన చేయడమేకాకుండా పదవుల ఆశతో కొత్త సంఘాన్ని ప్రారంభించారంటూ ఆర్కే సెల్వమణి ఆరోపించడాన్ని తీవ్రంగా టీఎఫ్‌సీఏ నిర్వాహకులు ఖండించారు. ఇదే అంశంపై పోలీస్‌ కమిషనర్‌ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా, టీఎఫ్‌సీఏకు తగిన భద్రత కల్పిస్తామని పోలీసుల హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు.

సినిమాల్లో నటించడం నా వ్యక్తిగతం

- అవంతిక సుందర్‌

సినిమాల్లో నటించాలన్న తన కోరిక పూర్తిగా తన వ్యక్తిగతమని నటి ఖుష్బూ, దర్శకుడు సుందర్‌ సి దంపతుల పెద్ద కుమార్తె అవంతిక సుందర్‌ అంటున్నారు. అయితే, అవంతిక సినిమాల్లో నటించడంపై ఖుష్బూ సుందర్‌ దంపతుల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ నేపథ్యంలో అవంతిక తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన మనసులోని మాటను బహిర్గతం చేశారు. 'నా కంటూ మార్గాన్ని ఏర్పరచుకునే స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల్ని నా తల్లిదండ్రులు ఇచ్చారు. సినిమాల్లో నటించాలన్నది నా వ్యక్తిగత నిర్ణయం. అభిప్రాయం కూడా. నా మనసులోని మాటను మా అమ్మకు చెప్పా. ఏ పనిచేసినా శ్రద్ధతో చేయాలని సూచించారు. లండన్‌లో నా విద్యాభ్యాసం పూర్తికాగానే సినిమాల్లో నటించాలన్న నిర్ణయానికి వచ్చి స్లిమ్‌గా మారుతున్నా. ఇపుడు సినిమా గురించి పూర్తిగా తెలుసుకుని అందులో అడుగుపెడుతున్నా. నేను నటించడం మొదలుపెట్టాక కచ్చితంగా మా మమ్మీతో పోలుస్తారు. మా అమ్మ స్థాయికి చేరుకోలేకపోయినా ఆమె పేరును మాత్రం కాపాడుతా. ఇపుడు కథల ఎంపికలో నిమగ్నమైవున్నా. ఈ యేడాదిలోనే నేను నటించే చిత్రంపై అధికారిక ప్రకటన వెలువడుతుంది' అని పేర్కొన్నారు.



అవంతిక సుందర్‌

తిరుత్తణి మురుగన్‌ ఆలయంలో పంగుణి వేడుకలు



తిరుత్తణి, ఏప్రిల్‌ 11 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో ప్రసిద్ధి చెందిన మురుగన్‌ ఆలయంలో పంగుణి వేడుకలను ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజాము నుండే శ్రీవళ్ళీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. ఉదయం 8 గంటలకు కావళ్లతో వచ్చిన భక్తులు పాలు, చక్కెర, పన్నీరు, పంచామృతం తదితరాలను ఆలయ అర్చకులకు సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు వాటితో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ పుణ్య ఘట్టాన్ని చూసి భక్తులు పులకించిపోయారు. తర్వాత స్వామివారు భక్తులకు బంగారు కవచంతో దర్శనమిచ్చారు. తిరువళ్లూరు జిల్లా కలెక్టర్‌ ప్రతాప్‌, ఆలయ జాయింట్‌ కమిషనర్‌ రమణి, ట్రస్ట్‌ కమిటీ చైర్మన్‌ శ్రీధరన్‌, ట్రస్టీలు కన్నల్‌ మోహనన్‌, వి.సురేష్‌బాబు, ఎం.నాగన్‌ తదితరులు పాల్గొన్నారు.



పంగుణి ఉత్తిరై పూజలో ఉంచిన కొబ్బరికాయ రూ.52వేలు!



వేలంలో రూ.52వేలు ధర పలికిన కొబ్బరికాయ

ప్యారీస్‌, ఏప్రిల్‌ 11 (ఆంధ్రజ్యోతి): తేనిజిల్లా బోడినాయకనూరులో 350 ఏళ్ళ పురాతన చరిత్రకలిగిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజలో ఉంచిన కొబ్బరి కాయను వేలంలో ఓ భక్తుడు రూ.52వేలకు సొంతం చేసుకున్నాడు. పంగుణి ఉత్తిరై ఉత్సవాల సందర్భంగా వళ్ళీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి శుక్రవారం తిరుకల్యాణోత్సవం నిర్వహించగా, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణోత్సవ వేదికపై పూజలో ఉంచిన పండ్లు, పూలు, తలంబ్రాలు తదితరాలను భక్తులందరికీ పంపిణీ చేశారు. అదేవిధంగా మంగళసూత్రం చుట్టిన కొబ్బరిని ఆలయ నిర్వాహకులు వేలం వేశారు. రూ.5వేలతో ప్రారంభమైన వేలం, క్రమక్రమంగా పెరుగుతూ రూ.52వేలకు పూరయ్యింది. బోడినాయకనూర్‌కు చెందిన పళని ఆండవర్‌ కుటుంబం సొంతం చేసుకుంది. గత ఏడాది పంగుణి ఉత్సవాల సందర్భంగా పూజలో ఉంచిన కొబ్బరికాయ రూ.30వేలకు ఓ భక్తుడు సొంతం చేసుకోగా, ఈ ఏడాది మునుపటి కంటే అధికంగా వేలం ద్వారా పళని ఆండవార్‌ కుటుంబం దక్కించుకోవడం మహా భాగ్యంగా భావిస్తున్నారు.

బంగారు పల్లకీలో రంగనాథుడి చిద్విలాసం

ప్యారీస్‌, ఏప్రిల్‌ 11 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లాలో భూలోక వైకుంఠంగా విరాజిల్లుతున్న రంగనాథస్వామి ఆలయంలో పంగుణి ఉత్సవాలు కోలాహలంగా జరుగుతున్నాయి. శుక్రవారం లోకకల్యాణార్థం నంబెరుమాళ్‌ను బంగారు పల్లకీలో పురవీధుల్లో భక్తుల గోవిందనామస్మరణలు, మేళతాళాల మధ్య ఊరేగించారు. ఈనెల 3న ధ్వజారోహణంతో ప్రారంభమైన పంగుణి ఉత్సవాలను పురస్కరించుకుని రంగనాథుడిని బంగారు గరుడవాహనం, శేషవాహనం, కల్పవృక్ష వాహనాల్లో కొలువుదీర్చి చిత్తిరై వీధుల్లో ఊరేగించారు. ఉత్సవాల్లో ఎనిమిదో రోజైన బుధవారం అశ్వవాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించారు. కాగా శుక్రవారం ఉదయం 6గంటలకు నంబెరుమాళ్‌ను అద్దాల మండపం నుంచి వేంచేపు చేసి బంగారు పల్లకీలో అధిష్ఠింపజేసి నాలుగు మాడవీధుల్లో ఊరేగించి తాయారు సన్నిధికి తరలించారు. ఆ తర్వాత దైవదంపతులకు సారె, నైవేద్యాలు నివేదించారు. ఈ వైభవంలో వేలాదిమంది దంపతులు పాల్గొన్నారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరిగినందుకు వల్ల వృద్ధులు, పిల్లలు, భక్తుల సంక్షేమార్థం ఆలయ ప్రాంగణం, బయట ఏర్పాటుచేసిన క్యూలైన్లలో పందిళ్ళు ఏర్పాటుచేసి, ఫ్యాన్‌లు, ఏసీ వసతులు కల్పించారు. తాయారు సన్నిధిలో భక్తుల దాహార్తిని తీర్చేందుకు, ప్రసాదాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశారు.



రంగనాథుడి పల్లకీ సేవ

ఘనంగా డాక్టర్‌ క్రిస్టియన్‌ ఫ్రెడ్‌ రిచ్‌ శామ్యూల్‌

- జయంతి వేడుకలు

అడయార్‌, ఏప్రిల్‌ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లోని శ్రీ వేంకటేశ్వర హోమియోపతి మెడికల్‌ కాలేజీ అండ్‌ హాస్పిటల్‌లో హోమియోపతి వ్యవస్థాపకుడు డాక్టర్‌ క్రిస్టియన్‌ ఫ్రైడ్‌ రిచ్‌ శామ్యూల్‌ హనిమాన్‌ 270వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను వేంకటేశ్వర హోమియోపతిక్‌ మెడికల్‌ కాలేజీ కరస్పాండెంట్‌ డాక్టర్‌ ఎ.శకుంతల ప్రారంభించగా, చీఫ్‌ ఆపరేటింగ్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ కార్తీక్‌ అధ్యక్షత వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వెల్బర్ట్‌ దాస్‌ బ్రిట్టో కార్యక్రమ ఏర్పాట్లు చేశారు. ఈ జయంతి వేడుకల్లో కేంద్ర ఆయుష్‌ మంత్రిత్వ శాఖ పరిధిలోని కౌన్సిల్‌ ఫర్‌ రీసెర్చ్‌ ఇన్‌ హోమియోపతి అసిస్టెంట్‌ డైరెక్టర్‌ (రిటైర్డ్‌), డాక్టర్‌ కొల్లిరాజు పాల్గొని గౌరవ అతిథిగా పాల్గొని, కేంద్ర హోమియోపతి పరిశోధన మండలి కార్యకలాపాలు, దేశంలో హోమియోపతి పురోగతి తదితర కీలకాంశాలపై ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. ఇందులో వేంకటేశ్వర హోమియోపతిక్‌ మెడికల్‌ కాలేజీ వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్‌ కొల్లి రాజును సత్కరిస్తున్న నిర్వాహకులు

గ్లెనెగ్లెస్‌లో కాలేయ మార్పిడిపై జాతీయ సదస్సు

అడయార్‌, ఏప్రిల్‌ 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ కార్పొరేట్‌ ఆస్పత్రుల్లో ఒకటైన గ్లెనెగ్లెస్‌ హాస్పిటల్‌లో రెండు రోజుల కాలేయ మార్పిడి చికిత్సా వైద్య నిపుణుల జాతీయస్థాయి సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. 'అడ్వాన్సింగ్‌ సైన్స్‌, ఎన్హాన్సింగ్‌ లైవ్స్‌' అనే థీంతో జరిగిన ఈ సమ్మిట్‌లో లివర్‌ కేర్‌, ట్రాన్స్‌ప్లాంట్‌ మెడిసిన్‌లో పలువురు వైద్య నిపుణులంతా సమావేశమై వివిధ అంశాలపై సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకున్నారు. జీఎల్‌టీఎస్‌ 2025ను వైద్యులు, సర్జన్లు, పరిశోధకులు, లివర్‌ ట్రాన్స్‌ప్లాంట్‌ ఎక్స్‌పర్ట్‌లను అనుసంధానిచే డైనమిక్‌, బహుళ క్రమశిక్షణా వేదికగా రూపొందించారు. ఈ సదస్సును గ్లెనెగ్లెస్‌ హాస్పిటల్‌ సీనియర్‌ వైద్య నిపుణులు, హాస్పిటల్‌ హైదరాబాద్‌ విభాగం సీఈవో డాక్టర్‌ నాగేశ్వర్‌ రావు కె, చెన్నై గ్లెనెగ్లెస్‌ హాస్పిటల్‌ హెపటాలజీ, ట్రాన్స్‌ప్లాంట్‌ హెపటాలజీ డైరెక్టర్‌ డాక్టర్‌ జాయ్‌ వర్గీస్‌లు ప్రారంభించారు.



జాతీయ సదస్సులో పాల్గొన్న వైద్య నిపుణులు

ఎరువుల సరఫరాపై మాడెన్‌ కీలక ఒప్పందం

అడయార్‌, ఏప్రిల్‌ 11 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్‌ ఇంటర్నేషనల్‌, సౌదీ మైనింగ్‌ కంపెనీ (గ్రూపు అనుబంధ విభాగం మాడెన్‌ ఫాస్ఫేట్‌ ఎరువుల తయారీ కంపెనీల మధ్య ఫాస్ఫేట్‌ ఎరువుల అంశంపై అవగాహన ఒప్పందం కుదిరింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఫాస్ఫేట్‌ ఎరువుల ఉత్పత్తిదారులలో ఒకటైన మాడెన్‌తో దీర్ఘకాలిక ఒప్పందంలో భాగంగా ఈ భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పంద పత్రాలపై కోరమాండల్‌ ఇంటర్నేషనల్‌ లిమిటెడ్‌ ప్రతినిధి నారాయణన్‌ వెల్లయన్‌, మాడెన్‌ ఫాస్ఫేట్‌ బిజినెస్‌ యూనిట్‌ (ఫెర్టిలైజర్స్‌ సేల్స్‌ కమర్షియల్‌) డైరెక్టర్‌ సౌదీ అల్‌ తమీమి సంతకాలు చేశారు. ఈ సదర్భంగా నారాయణన్‌ మాట్లాడుతూ... ఫాస్ఫేట్‌ ఎరువుల వ్యాపార కార్యక్రమాల్లో భాగంగా, భారతీయ వ్యవసాయ రంగానికి తోడ్పడే ముఖ్యమైన ఎరువుల సరఫరాకు సంబంధించి నమ్మకమైన, స్థిరమైన సరఫరాను నిర్ధారించడంలో ముఖ్యమైన మైలురాయిగా ఉంటుందని వెల్లడించారు.



ఒప్పందపత్రాలను మార్చుకుంటున్న కంపెనీల ప్రతినిధులు

ఊటీలో అర్ధరాత్రి బాహుబలి ఏనుగు సంచారం

చెన్నై, ఏప్రిల్‌ 11 (ఆంధ్రజ్యోతి): ఊటీ - మేట్టుపాళయం రహదారిలో బాహుబలి ఏనుగు సంచరిస్తుండటంతో వాహన చోదకులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. గురువారం రాత్రి ఆ ఏనుగు ఊటీ నగర శివార్లలోని రహదారిలో సంచరించడంతో ఇరువైపులా వాహనచోదకులు తమ వాహనాలను నిలిపివేశారు. అరగంటకు పైగా అటూ ఇటూ సంచరించిన ఆ ఏనుగు అటవీ ప్రాంతంలోకి వెళ్లటంతో వాహన చోదకులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయమై అటవీ శాఖాధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు.



ఊటీ సబర్బన్‌ రహదారిలో నిలిచిన ఏనుగు



రఘురామకృష్ణరాజు, గురజాల జగన్మోహన్



ద్వారక తిరుమలరావు



రాణీ కుముదిని, నీలం సాహ్నీ




జస్టిస్ సంతోష్‌రెడ్డి

శ్రీవారిసేవలో ప్రముఖులు

ఏపీ శాసనసభ డిప్యూటీస్పీకర్ రఘురామకృష్ణ రాజు శుక్రవారం ఉదయం కుటుంబ సమేతంగా అభిషేక సేవలో పాల్గొని శ్రీవారి దర్శనం చేసుకున్నారు. తెలంగాణ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సంతోష్‌రెడ్డి ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఇంకా ఏపీ, తెలంగాణ ఎలక్షన్ కమిషనర్లు నీలం సాహ్నీ, రాణీ కుముదిని, బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఆర్టీసీ ఎండీ ద్వారకతిరుమలరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, తెలంగాణ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి కూడా శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం : రూ.3.94 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 57,462

తలనీలాలు సమర్పించినవారు : 22,998



షాపులో పల్లింటి చంద్రశేఖర్

ఆత్మవిశ్వాసమే పెట్టుబడిగా..

వైకల్యాన్ని కాదని స్వావలంబన

మరో ముగ్గురు మహిళలకూ ఉపాధి

పుత్తూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వైకల్యానికి కుంగిపోలేదు. ఆత్మన్యూనతతో వెనుకంజ వేయలేదు. చేయూత కోసం ఎదురుచూడలేదు. ఆత్మవిశ్వాసాన్ని కూడకట్టుకున్నాడు. అదే పెట్టుబడిగా ముందడుగు వేశాడు. మరో ముగ్గురికి ఉపాధి చూపే స్థాయికి ఎదిగాడు. స్వయంకృషికి చిరునామాగా నిలిచాడు. అతడే పుత్తూరుకు చెందిన పల్లింటి చంద్రశేఖర్. పుట్టుకతోనే పోలియోబారిన పడ్డాడు. రెండు కాళ్లూ సరిగా పనిచేయవు.అడుగులు వేయడం కష్టమైనా చిన్నప్పుడు స్కూలుకు వెళ్లేవాడు. పరిస్థితుల ప్రభావంతో ప్రాథమిక విద్యతో ఆపేయాల్సి వచ్చింది. తండ్రికి కొద్దిపాటి వ్యవసాయముంది. అతనికి చేదోడువాదోడుగా నిలిచాడు. వయసు మీరుతున్న తండ్రికి భారం కాకూడదని భావించాడు. స్వయం ఉపాధితో స్వావలంబన సాధించాలని సంకల్పించాడు. ఈక్రమంలో కొన్నాళ్ల క్రితం ఇడ్లీ పిండి మిషన్‌ను ప్రారంభించాడు. తల్లిదండ్రులు తోడుగా నిలిచారు. తర్వాత మరో అడుగేసి గోధుమలు, రాగులు, బియ్యం, మిరపకాయల పిండి మిషన్లతో వ్యాపారాన్ని విస్తరించాడు. పదుగురి ఆరోగ్యానికీ మేలు చేయాలని వేరుశనగ, నువ్వుల మర గానుగలను, నూనె ఫిల్టర్లను ప్రారంభించాడు. స్వచ్ఛమైన గానుగ నూనెలూ, కల్తీ లేని పిండిలు దొరికే ప్రాంతంగా పుత్తూరులో చంద్రశేఖర్ ప్రజల విశ్వాసాన్ని పొందగలిగాడు. ముఖ్యంగా గానుగ నూనెను జనం ఆదరించారు. అంతేకాదు గోధుమ, రాగి, శనగ, జొన్న, సజ్జ, ధనియాలు, మిరప, పసుపులాంటివీ విక్రయిస్తున్నాడు. ఇటీవల తండ్రి చనిపోయాడు. వృద్ధురాలైన తల్లిని పోషిస్తున్నాడు. ఇప్పుడు ఇతడితో పాటు మరో ముగ్గురు మహిళలు పనిచేస్తున్నారు. సమయపాలన, క్రమశిక్షణలను పాటించే అరవయ్యేళ్ల చంద్రశేఖర్ తన కాళ్లమీద తాను నిలబడి మరోముగ్గురికి ఉపాధినిస్తున్న తీరు స్ఫూర్తిదాయకమనడం నిస్సందేహం.

కళ్యాణం.. వైభోగం



యజ్ఞోపవీత ధారణ

స్వర్ణకిరీటం

రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ
వరమాలకై వేచె సమయాన..
శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె
మోగింది కల్యాణ శుభవేళ..
కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...

అన్నట్లుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యాణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామయ్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.



కళాకారుల నృత్యం



పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు





ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం



ఎదుర్కోలు దృశ్యం



సీతారాముల కల్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు

మహిళా విద్యకోసం జ్యోతిరావు పూలే కృషి



కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహిళల విద్య కోసం జ్యోతిరావు పూలే ఎనలేని కృషి చేశారని జేసీ శుభం బన్సల్ అన్నారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా బాలాజీకాలనీలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ స్త్రీలకు విద్య అవసరాన్ని గుర్తించి ఆ దిశగా జ్యోతిరావు పూలే కృషి చేశారన్నారు. సామాజిక సంస్కరణలకు నాంది పలికారన్నారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ సదాశివం మాట్లాడుతూ జ్యోతిరావ్‌పూలే చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. అనంతరం వివిధ కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులకు రూ.14.31కోట్ల రుణాల మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజేంద్రకుమార్‌రెడ్డి, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు మదనమోహన్, చంద్రన్న, చెన్నారెడ్డి పాల్గొన్నారు.



తుంబుర తీర్థానికి వెళ్లే దారిలో సేద తీరుతున్న భక్తులు

తుంబుర తీర్థానికి తరలిన భక్తులు

తిరుమల, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): తిరుమల తుంబురతీర్థానికి శుక్రవారం భక్తులు తరలివెళ్లారు. ఏటా శ్రీవారి ఆలయానికి ఏడున్నర మైళ్ల దూరం వెలసిన తుంబురతీర్థ ముక్కోటిని నిర్వహించడం ఆనవాయితీ. నిజానికి శనివారం తుంబుర తీర్థ ముక్కోటి అయినప్పటికీ, ఆ ఘడియలు ముందుగా ప్రారంభం కావడంతో శుక్రవారం కూడా భక్తులను తీర్థానికి అనుమతించారు. తిరుపతి, తిరుమల స్థానికులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులూ తీర్థానికి వెళ్లి స్నానాలు ఆచరించి, తుంబురనాథుడికి పూజలు నిర్వహించారు. భక్తుల కోసం పాపవినాశనం వద్ద అన్నప్రసాదాలు, తాగునీరు, భద్రతను టీటీడీ ఏర్పాటు చేసింది. శనివారం ఉదయం 5 నుంచి 10 గంటల వరకు భక్తులను తీర్థానికి అనుమతించనున్నారు.

నేడు సీపీటీ పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం నుంచి జరగనున్న ఏపీపీఎస్సీ కంప్యూటర్ - కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్టు(సీపీటీ)కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన అధికారులతో సమీక్షించారు. పుత్తూరులోని వెంకటేశ పెరుమాల్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో శని, ఆదివారాలు రెండు సెషన్లలో పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. 600 మంది హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసరావు, రామాజీ పాల్గొన్నారు.

కడప మార్గం మూసివేత

- భాకరాపేట వైపు వాహనాల దారి మళ్లింపు



కొత్త చెక్‌పోస్ట్ కూడలిలో బ్యారికేడ్లు పెట్టిన పోలీసులు

రేణిగుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణ మహోత్సవం నేపథ్యంలో రేణిగుంట, కరకంబాడి నుంచి కడప వైపు వెళ్లే రోడ్డు మార్గాన్ని శుక్రవారం సాయంత్రం పోలీసులు మూసివేసి వాహనాలను దారి మళ్లించారు. ఒంటిమిట్ట ఆలయం ప్రధాన రహదారి పక్కనే ఉండటం.. సీఎం చంద్రబాబు హాజరవుతుండటం.. అధిక సంఖ్యలో విచ్చేసే భక్తులకు ఇబ్బంది లేకుండా ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాల మేరకు భారీ వాహనాలను ఆపేశారు. రేణిగుంట కొత్త చెక్ పోస్ట్, కరకంబాడి కట్ట పుట్టాలమ్మ ఆలయ సమీపంలో రేణిగుంట, గాజులమండ్యం, తిరుపతి ట్రాఫిక్ పోలీసులు రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేసి భారీ వాహనాలను భాకరాపేట వైపు దారి మళ్లించారు. శనివారం ఉదయం 9 గంటలకు కడప మార్గాన్ని తెరవనున్నారు.

హలో.. జంప్ చేస్తా



తిరుపతి నగరం లీలామహల్ కూడలిలోని గరుడ వారధి తొలి అంతస్తు సైడ్‌వాల్‌పై శుక్రవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి కూర్చొని జంప్ చేస్తానంటూ హల్‌చల్ చేశాడు. వద్దంటూ జనం కేకలు వేశారు. పోలీసులకు సమాచారమిచ్చారు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తించారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

20లోగా టీడీఆర్ బాండ్లు గిఫ్ట్ డీడ్ దశకు రావాలి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనరు మౌర్య

తిరుపతి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): అన్ని టీడీఆర్ బాండ్లు ఈ నెల 20వ తేదీ లోపు గిఫ్ట్ డీడ్ దశకు రావాలని, అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య హెచ్చరించారు. టీడీఆర్ బాండ్ల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, నమోదు తదితర అంశాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. టీడీఆర్ బాండ్ల మేళాను శుక్రవారం సాయంత్రం ఆమె పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని ఆన్‌లైన్ అయ్యాయి? ఎవరెవరి దరఖాస్తులు ఏ దశలో ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల నమోదు ప్రక్రియ ఆలస్యమవుతోందన్నారు. ఆయా మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించిన అధికారులు ప్రజలకు ఫోను చేసి వారి వివరాలు సేకరించాలని ఆదేశించారు. సెలవు రోజుల్లోనూ ఆన్‌లైన్ చేయించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డీసీపీ. మహాపాత్ర, ఏసీపీలు బాలాజి, మూర్తి, టీపీబీవోలు, రోడ్డు ఇంచార్జులు, సెక్రటరీలు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో మూతపడ్డ 'జనఔషధి'

- రాయితీతో మందుల దొరక్క రోగుల అవస్థలు



తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): 'ప్రధానమంత్రి భారతీయ జనఔషధి కేంద్రం' పేరిట గతంలో స్విమ్స్‌లోని ఓపీ విభాగం లోపల ఏర్పాటు చేసిన జనరిక్ మందుల దుకాణం వారం కిందట మూతపడింది. గడువులోగా పునరుద్ధరణకు చర్యలు చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఈ దుకాణంలో 50-70 శాతం రాయితీతో జనరిక్ మందులను ఇస్తారు. వాటిని ఎలా వాడాలి? వాటి ఉపయోగాల గురించి చెప్పేందుకు ప్రత్యేకంగా ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. బయట మార్కెట్ ధరల కంటే అతి తక్కువ ధరల్లో మందులు లభ్యమవుతుండటంతో దూర ప్రాంతాల రోగులు నెలకు సరిపడా మందులను కొనుగోలు చేసి వెళ్లేవారు. ఈ దుకాణంలో రోజుకు రెండు వేల మందికిపైగా రోగులు మందులు కొనేవారు. రోజుకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు విక్రయాలు జరిగేవి. గతంలో స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్లో స్విమ్స్‌లోని జనరిక్ మందుల దుకాణం గురించి ప్రశంసించారు కూడా. ఈ దుకాణం గడువు ముగిసిందంటూ వారం కిందట మూత పడింది. దీంతో రాయితీ మందులు దొరక్క రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గడువు ముగియకముందే కొనసాగింపు ప్రక్రియ చేపట్టి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ప్రధానమంత్రి భారతీయ జనఔషధి కేంద్రం పేరుతో జనరిక్ మందుల దుకాణాలు కొనసాగుతున్నా కేవలం స్విమ్స్‌లోనే మూతపడింది.

సంస్కృత భాష సంరక్షణకు కృషి

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సంస్కృత భాష సంరక్షణకు, సనాతన ధర్మ పరిరక్షణకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విశేష కృషి చేస్తోందని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో గురుకుల విశ్వనాథ ధ్యాన మందిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా శివ లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ గురుకుల పద్ధతిలో అధ్యయన-అధ్యాపనం, శాస్త్ర పరిరక్షణకు ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. వైవిధ్యమైన పాఠ్యాంశాలను విశ్వవిద్యాలయం ద్వారా విద్యార్థులకు అందించడం శుభపరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అకడమిక్ డీన్ రజనీకాంత్ శుక్లా, రిజిస్ట్రార్ కె.వెంకట నారాయణరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న కంచి కామకోటి పీఠాధిపతి